పూల పండగ.. సంబరంగా!

జిల్లా వ్యాప్తంగా బుధవారం బతుకమ్మ సంబరాలను మొదటి రోజు ఘనంగా జరుపుకొన్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలు అలంకరించి మహిళలు ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆట పాటలతో సందడి చేశారు.


బతుకమ్మలతో చిన్నారులు


కొత్తపల్లిగోరిలో..

జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయస్వామి, సంతోష్మాత ఆలయం, సుభాష్‌కాలనీలో రామాలయం, కృష్ణాకాలనీలో గీతా మందిర్, అయ్యప్పస్వామి ఆలయం, రెడ్డికాలనీ, లక్ష్మినగర్, ఎల్బీనగర్, శాంతి నగర్, సీఆర్‌నగర్, పాయిలెట్‌కాలనీ ప్రాంతాలు సందడిగా మారాయి. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మహిళలకు ఏలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు వివిధ రకాల పూల విక్రయాలతో సందడిగా మారింది. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, భూపాలపల్లి


లక్ష్మినగర్‌లో బతుకమ్మపై అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న మహిళ


జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయానికి బతుకమ్మలతో వస్తున్న మహిళలు

పాత విధానం అమలు..

కాళేశ్వరం, న్యూస్‌టుడే: గతంలో కాళేశ్వర క్షేత్రంలో ఉత్సవాల సమయంలో అప్పటి దేవస్థానం అధికారులు స్థానికుల ఇష్టాఇష్టాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా గ్రామస్థులకు సమాచారం ఇచ్చేందుకు సిబ్బందితో స్థానికులకు ఆహ్వానం పంపేవారు. 5 సంవత్సరాల నుంచి ఆ పద్ధతికి దేవస్థానం అధికారులు స్వస్తి పలికి వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. దీంతో స్థానికులు అసంతృప్తి చెందుతున్నారు. దీంతో తిరిగి పాతపద్ధతిని అమలు పరిచారు. శరన్నవరాత్రి ఉత్సవాల కోసం దేవస్థానం సిబ్బంది రిజిస్టరు పట్టుకొని పలువురి వద్దకు వెళ్లి సమాచారం అందించారు.

వయోవృద్ధులకు అండగా నిలవాలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: వయసు పైబడిన వారిని ప్రేమతో గౌరవంగా చూసుకోవాలని, వారికి అండగా నిలవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్. రాంచంద్రారావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో ఉంటున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంపత్, న్యాయవాది రాజ్ కుమార్, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు శైలజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి రాంచంద్రారావు

అభివృద్ధి, వసతుల కల్పనే లక్ష్యం

కాటారం, న్యూస్‌టుడే: ఈ ప్రాంత అభివృద్ధి, మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించి నివాళి అర్పించారు. ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలనే ఆలోచనతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. తొమ్మిదేళ్లుగా ఈ ప్రాంతం అశాంతికి నిలయంగా ఉండేదని.. పార్టీ నాయకులు, నాయకత్వం లేకుండా చేసే ప్రయత్నం చేసినా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలనే ప్రయత్నంతో మార్పు కోసం రాజ్యాంగబద్ధంగా ప్రజలు తమకు అవకాశం ఇచ్చారని తెలిపారు. డివిజన్ పరిధిలో వంద మంది చొప్పున ఔత్సాహిక మహిళలను ఎంపిక చేసి శిక్షణ అందించి కాటారం ప్రాంతంలో సుమారు రూ.5 కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణపై నివేదిక సిద్ధం చేస్తున్నామని, కాటారం ప్రభుత్వ శిక్షణ సంస్థకు రూ.4 కోట్లతో త్వరితగతిన భవన నిర్మాణం ప్రారంభించి ఉపాధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో అవినాష్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మహదేవపూర్: మహిళలు ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వం మహిళా సాధికారతకు పాటుపడుతోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . క్యాంటీన్ల ప్రారంభంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికపరంగా పునాది రాయి పడిందన్నారు. మహిళలతో కలిసి అల్పాహారం తిన్నారు. మహిళ సంఘాలకు చెక్కులను అందించారు. మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యుల కొరత, మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరుతూ అల్ ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకులు లింగాల రామయ్య, లక్ష్మణ్ మంత్రికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.


కాటారంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

అటవీ అధికారుల తీరుపై అసంతృప్తి..

జిల్లా అటవీ శాఖ అధికారుల తీరుపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన పలు సమస్యలు, భూ సమస్యలపై అటవీ శాఖ అధికారుల తీరుపై పలువురు మంత్రికి ఫిర్యాదు చేశారు. ప్రజలకు సేవ చేయాలని, ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారితో చరవాణిలో మాట్లాడి సంబంధిత అధికారి తీరు పరిశీలించి, చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ నిధులతో చేపట్టిన చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, కాలాయాపన, నాణ్యత లోపం ఉంటే సహేంచేది లేదన్నారు. పంచాయతీరాజ్ పనుల పురోగతిపై పర్యవేక్షించాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు.

ఇది మా అడ్డా

నిత్యం రద్దీగా ఉండే భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో రాత్రి 8 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంట పడి గాయపరుస్తున్నాయి. పట్టణంలో కుక్కల బెడద నివారించాలని పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

– న్యూస్‌టుడే, భూపాలపల్లి



నిరుపయోగంగా నీటిశుద్ధి యంత్రం

భూపాలపల్లి ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికుల కోసం కొన్నేళ్ల క్రితం లక్షలు వెచ్చించి నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు బాటిళ్ల ద్వారా తాగునీరు తీసుకుని డ్యూటీలకు వెళ్లేవారు. ఆరు నెలలుగా మరమ్మతులకు గురై తాగునీటి సమస్య ఏర్పడింది. వాటర్ ప్లాంటు పై భాగంలో రేకులు లేకపోవడంతో విలువైన పరికరాలు ఎండలో ఎండుతూ, వర్షంలో తడిచి పనికి రాకుండా పోతున్నాయి. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు కార్మిక సంఘాల నాయకులు కోరినా ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు డిపోలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భూపాలపల్లి



ఘనంగా గాంధీ జయంతి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: గాంధీ చూపిన శాంతి మార్గాల ద్వారా ఎలాంటి సమస్యనైనా జయించవచ్చని కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మోహియొద్దిన్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. అహింసా సిద్ధాంతం, స్వచ్ఛతా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గాంధీజీ సేవలు మరువలేనివన్నారు. గాంధీ ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో..

మంటలు రేపిన మాటలు!




● హస్తం.. గులాబీల మధ్య వేడెక్కిన రాజకీయం

ఓరుగల్లు రాజకీయాలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో అట్టుడుకుతున్నాయి. అధికార హస్తం, విపక్ష భారాస మధ్య పంచాయితీ పతాకస్థాయికి చేరుకొంది.. పచ్చ గడ్డి వేస్తే భగ్గుమన్నట్టుగా మాటల యుద్ధం మొదలైంది. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం రాజధాని హైదరాబాద్‌లో మాజీ మంత్రి, భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయి ఆరోపణలు చేయడం, అంతకు రెండు రోజుల ముందు ఓరుగల్లు అభివృద్ధి పనులపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ల మధ్య జరిగిన గలాటా లాంటి వరుస ఘటనలు ఓరుగల్లులో కలకలం రేపాయి.

–ఈనాడు, వరంగల్

భాజపా నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇటీవల నూలు దండను బహుమానంగా మంత్రి కొండా సురేఖ మెడలో వేయడం, ఆ తర్వాత నెటిజన్లు దీనిపై ట్రోలింగ్ చేయడం గొడవకు దారి తీసింది. భారాస నేతలే పనిగట్టుకొని ట్రోలింగ్ చేస్తున్నారని, ఈ వ్యవహారం వెనక మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నారంటూ సురేఖ విరుచుకుపడ్డారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ భవన్‌ను ముట్టడించిన కార్యకర్తల్లో వరంగల్‌కు చెందిన వారు ఉన్నారు. మహిళా మంత్రి అని కూడా చూడకుండా గులాబీ నేతలు అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మంత్రి సురేఖకు సంఘీభావం తెలిపారు. ఈ రాజకీయ వివాదంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ కీలక నేతలు మడికొండ ఠాణాలో బుధవారం ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమై ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో కొండా సురేఖ వర్సెస్ కేటీఆర్ వివాదాన్ని కాంగ్రెస్ శ్రేణులు అంత తేలిగ్గా వదలడం లేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నా.. తామంతా ఒక్కటేనని చాటుతూ భారాసపై పదునైన విమర్శలు గుప్పిస్తూ ప్రజల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

నువ్వా.. నేనా..



మరో వైపు పశ్చిమ నియోజకవర్గంలోనూ అధికార విపక్ష పార్టీల మధ్య అభివృద్ధిపై అగ్గిరాజుకుంది. ఇరు పార్టీల కార్యకర్తల తోపులాటలకు దారి తీసింది. ఇటీవల కాళోజీ కళా క్షేత్రం, నయీంనగర్ నాలాపై వంతెన పనులు పూర్తయ్యాయి. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయడం వల్లే వీటిని వేగవంతంగా పూర్తి చేయగలిగామని ప్రకటించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. ఈ పనులకు ప్రతిపాదనలు, నిధులు భారాస హయాంలోనే కేటాయించామని.. కాంగ్రెస్ సర్కారు అంతా తామే చేసినట్టు ప్రగల్భాలు పలుకుతోందంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో నయీంనగర్ నాలా వద్ద చేయి, కారు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగడం సంచలనంగా మారింది.

భారాస నేతలు సిద్ధం..

ఒకవైపు కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖకు శ్రేణులు మద్దతిస్తుండగా మరోవైపు కేటీఆర్‌కు మద్దతుగా భారాస ఉమ్మడి జిల్లా నేతలు నిలబడుతున్నారు. కేటీఆర్‌పై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సర్కారు వైఖరిని ఎండగట్టారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేశారు. శ్రీహరి విజయానికి ప్రతి ఒక్క భారాస కార్యకర్త కష్టపడితే ఆయన హస్తం గూటికి చేరడం ప్రజలను మోసం చేయడమే అంటూ మండిపడ్డారు.

కొత్త పంతుళ్లు వచ్చేస్తున్నారు..!

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో 237 ఉపాధ్యాయ స్థానాలు భర్తీ కానున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం 165 మంది ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలనకు ప్రత్యేకంగా 11 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటర్‌లో ఎంఈవో ఆధ్వర్యంలో ముగ్గురు ఉపాధ్యాయులు కలిసి, వారికి కేటాయించిన 40 మంది అభ్యర్థులకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఒరిజనల్ పత్రాలతో పాటు రెండు జిరాక్స్ సెట్లు, మూడు పాస్ ఫొటోలతో హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ సూచించారు. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన పత్రాలతో రావాలన్నారు.

విభాగాల వారీగా..

జిల్లా మొత్తం 237 పోస్టుల్లో ఓసీలకు 82, ఎస్సీలకు 41, ఎస్టీ 19, బీసీ (ఏ) 21, బీసీ (బీ)16, బీసీ(సీ) 2, బీసీ(డీ) 10, బీసీ(ఈ) 7, దివ్యాంగుల కోటాలో 12, ఈడబ్ల్యూఎస్ కోటాలో 18, క్రీడ విభాగంలో 3, విశ్రాంత సైనికుల కోటాలో 6 పోస్టులు భర్తీ చేస్తున్నారు. స్థానిక సంస్థల బడుల్లో 234, సాధారణ బడుల్లో ముగ్గురు ఉపాధ్యాయులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న నియామక పత్రాలను అందిస్తారు. దసరా తర్వాత కొత్త ఉపాధ్యాయులు సర్కారు బడుల్లో చేరే అవకాశాలున్నాయి.


సూచనలు ఇస్తున్న డీఈవో రాజేందర్

భర్తీ కానున్న పోస్టుల వివరాలు..

ఎస్జీటీలు	165
ఎల్పీ హిందీ	7
ఎల్పీ తెలుగు	13
పీఈటీ (తెలుగు)	7
ఎస్ఏ జీవశాస్త్రం	9
,, ఆంగ్లం	6
,, హిందీ	2
,, తె–మాధ్యమం	4
,, ఫిజికల్ ఎడ్యుకేషన్	2
,, ఫిజికల్ సైన్సు	3
,, సాంఘికశాస్త్రం	11
,, తెలుగు	4
,, స్పెషల్ ఎడ్యుకేషన్	4

మొదటి ప్రయత్నంలోనే..



భూపాలపల్లి మున్సిపాలిటీ జంగేడు గ్రామానికి చెందిన మౌనిక 8వ ర్యాంకు సాధించింది. మొదటి ప్రయత్నంలోనే ప్రభుత్వ కొలువు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సహంతోనే ఉద్యోగం వచ్చిందని పేర్కొన్నారు.

కష్టపడ్డారు.. కొలువు సాధించారు!

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి ముందుకు సాగారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్య ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ డీఎస్సీ తాజా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ధ్రువ పత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులతో 'న్యూస్‌టుడే' సంప్రదించగా ప్రభుత్వ కొలువు సాధించామని సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటి దగ్గర సన్నద్ధమై..



జిల్లాలోని తాడిచర్ల గ్రామానికి చెందిన యాంసాని రవళి డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 9వ ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయ కొలువు సాధించాలని రెండు నెలల పాటు ఇంటి దగ్గర సన్నద్ధమయ్యారు. తన రెండేళ్ల పాపతో ధ్రువ పత్రాల పరిశీలనకు వచ్చారు.

సత్తాచాటిన అక్కాచెల్లెలు

తాడిచర్ల మండలం అనుసాన్‌పల్లి గిరిజన తండాకు చెందిన గుగులోతు రాజు నాయక్, సమ్మక్క దంపతులకు ఇద్దరు కూతుర్లు మమత, వినీత, వ్యవసాయ పనులు చేసుకుంటూ ఇంట్లో 3 నెలల పాటు డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఎస్జీటీలో వినిత 20వ ర్యాంకు, మమత 76 వ ర్యాంకు సాధించారు. తల్లితండ్రుల ప్రోత్సహంతోనే ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు.


గుగులోతు మమత, వినీత

కుటుంబ కష్టాలను అధిగమించి..



భూపాలపల్లి పట్టణానికి చెందిన గుండా హిమబిందూ డీఎస్సీలో ఓసీ కోటాలో 18 ర్యాంకు సాధించారు. గృహిణిగా ఉండి కొలువు సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ధ్రువ పత్రాల పరిశీలనకు తన రెండేళ్ల పాపతో హాజరయ్యారు.

వేడుకలకు ముస్తాబు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర దేవస్థానం శరన్నవరాత్రి వేడుకలకు సిద్ధమైంది. ప్రధాన ఆలయంతో పాటు అమ్మ వారి ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. పూర్వం నుంచి దేవస్థానం ఆవరణలోనే స్థానిక మహిళలు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ.. దేవస్థానం తరపున వేదికను ఏర్పాటు చేశారు.


విద్యుత్తు దీపాలతో పార్వతీ ఆలయం

ఆ ప్రధానోపాధ్యాయుడి తీరే వేరు..!

కమలాపూర్ (హనుమకొండ), న్యూస్‌టుడే: ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఓ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు.. పని చేసిన ప్రతిచోటా వివాదాలే.. మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగినుల పట్ల ఆయన తీరే వేరు.. వేధింపులు భరించలేక పలువురు.. డీఈవోలు, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీకి సైతం ఫిర్యాదు చేశారు. చివరికి రాష్ట్ర మానవహక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను సైతం న్యాయం కోసం ఆశ్రయించారు. ఇప్పటికీ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో, విద్యాశాఖ ఆర్జేడీ వద్ద విచారణలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో పనిచేసిన ఓ పాఠశాలలో గిరిజన మహిళా పీఈటీని వేధిస్తే ఆమె న్యాయం కోసం కమిషన్లను ఆశ్రయించారు. అయినా ఎలాంటి చర్యలు లేవు. హనుమకొండ జిల్లాలోని పాఠశాలలో ఓ ఉపాధ్యాయినిని సైతం వేధించాడు. భూపాలపల్లి జిల్లాలోని ఓ మండల కేంద్రంలో పనిచేసినప్పుడు మహిళా టీచర్ పట్ల దురుసుగా ప్రవర్తించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంప్లెక్స్ పరిధిలోనూ ఆయన తీరు మారడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి మాట్లాడాలని బహు అర్థాలు వచ్చేలా మహిళలతో మాట్లాడటం ఆయనకే చెల్లింది. మహిళా ఉద్యోగులు చేసే పనిని వేరే ఉపాధ్యాయులతో చేయించడం వంటివి చూస్తే ఆయన్ను ఎవరో కాపాడుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఓ ఉపాధ్యాయుడిని వేధించిన కేసులో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఎలాంటి ఫలితం లేదు. ఓడీల పేరుతో తిరిగే ఆ హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కోమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49.3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. విఘ్నేష్ 55, అర్పిత్ 35 పరుగులతో రాణించారు. ఛేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. 118 పరుగుల భారీ తేడాతో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గురువారం కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్; మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

జీఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ప్రకటన

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని నర్సింగ్ స్కూల్‌లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్ఎం)లో మూడేళ్ల కోర్సులో చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ప్రకటన జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 29న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకు http://dme.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక.. మంత్రి చేయూత



ఈనాడు కథనానికి స్పందన

పలిమెల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు తమకు రూ.లక్ష ఖర్చవుతోందని, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో నగదు సమకూర్చడం వారికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో 'అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక.. అడ్డంకిగా మారిన పేదరికం' అనే శీర్షికతో మంళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి బుధవారం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దందెర రాజేందర్ స్పందించారు. మహాదేవపూర్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు యువతి సమస్యను వివరించారు. నగదు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మని ఆదేశించారు. మంత్రి యువతిని సన్మానించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.

బహు పౌష్టికం.. బతుకమ్మ ప్రసాదం





బతుకమ్మ ప్రసాదం ఆరోగ్యదాయం. వాటిని చిరుధాన్యాలతో తయారుచేయడం వల్ల పోషకాలు మెండుగా ఉంటాయని హనుమకొండకు చెందిన ప్రముఖ న్యూట్రిషనిస్టు జ్ఞానేశ్వర్ తెలిపారు.

పువ్వులతో దేవుడిని పూజిస్తారు.. ఆ పువ్వులనే దేవతలుగా, ఆడబిడ్డలే ఇంటి ఆరాధ్యదేవతగా పూజించే గొప్ప ప్రకృతి పండగ బతుకమ్మ. అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే ఈ పండగలో ప్రసాదాలు సైతం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పూలతో తయారు చేసిన రంగు రంగుల బతుకమ్మలను చెరువు గట్లమీదకు తీసుకెళ్లి ఆడిపాడిన తర్వాత ఆడబిడ్డలు తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ఆత్మీయతను పంచుకుంటారు. తొమ్మిది రోజులు రోజుకో తీరు ప్రసాదాలు(సద్ది)ని తీసుకెళతారు. తరచి చూస్తే ప్రతి సద్దిలోనూ చిరుధాన్యాలతో తయారు చేసినవి ఉంటాయి. బతుకమ్మకు రోజుకో రకంగా సమర్పించే ప్రసాదాలు.. వాటి ఆరోగ్య ప్రాముఖ్యం గురించి ప్రత్యేక కథనం..

- న్యూస్‌టుడే, కాజీపేట

1 ఎంగిలిపూల బతుకమ్మ

● ప్రసాదం: ఊక(ముడి)బియ్యం, బెల్లం కలిపిన ముద్దలు చేస్తారు.

● ప్రయోజనం: ముడి బియ్యంలో బి కాంప్లెక్సు ఉంటుంది. కొందరు నూకలతో చేస్తారు కాబట్టి త్వరగా జీర్ణం అయ్యే కార్బొహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి.

మహబూబాబాద్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో..

2 అటుకుల..

● సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో పెసర లేదా కందిపప్పును నానబెట్టి దానినే ప్రసాదంగా తీసుకెళతారు. అటుకులనే ప్రధానంగా సద్దిగా తీసుకెళతారు కాబట్టి దీనిని అటుకుల బతుకమ్మ అంటారు.

● పెసరపప్పులో ఎక్కువగా ప్రొటీన్‌లుంటాయి. బెల్లంలో ఇనుము ఉంటుంది. ఇది బాలికలకు, మహిళలకు మేలు చేస్తుంది.

3 ముద్దపప్పు

● ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం చేసుకుని తీసుకెళతారు.

● ఇందులో బెల్లం ఉంటుంది. మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరానికి కావాల్సిన ఇనుమును అందిస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్టు రమాదేవి తెలిపారు.

4 నానబియ్యం

● నానబెట్టిన బియ్యానికి పాలు, బెల్లం కలిపి వండుతారు. ఈ ప్రసాదం వేడిగా ఉండటానికి బతుకమ్మ ఆడడానికి కొద్ది సమయం ముందు తయారు చేసుకుని వెళతారు.

● ఇందులోనూ బెల్లానికి ప్రాధాన్యం ఇస్తారు.

5 అట్ల..

● బియ్యం పిండిని అట్లుగా పోస్తారు. వీటికి కొందరు బెల్లం లేదా చక్కర కలపడం వల్ల తీయగా ఉంటాయి.

● మంచి పోషకాహారం. ఎదుగుదలకు తోడ్పడుతుంది.

6వ రోజు

బతుకమ్మ పండగకు సెలవు. ఈ రోజు అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఆటకు దూరంగా ఉంటారు.

7 వేపకాయల

● సకినాలు చేసే పిండి పదార్థాన్ని చిన్న చిన్న వేపకాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో కాలుస్తారు. ఇవి వేపకాయల్లాగా ఉంటాయి కాబట్టి వేపకాయల బతుకమ్మ అంటారు.

● ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇంట్లో తయారుచేసుకోవచ్చు. శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.

8 వెన్న ముద్దల

● వెన్నతో తయారు చేసిన నువ్వుల ఉండలను ఫలహారంగా చేస్తారు. వెన్న, నెయ్యి, నువ్వులు శరీరానికి కావాల్సిన ప్రొటీన్‌లు, కాల్షియం అందిస్తాయి.

● వెన్న, నెయ్యి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతాయి.

9 సద్దుల బతుకమ్మకు సత్తుపిండి

మొక్కజొన్న గింజలు వేయించి. . వాటిని పొడి చేసి బెల్లం రవ్వలు కలిపిన పిండినే సత్తుపిండి అంటారు. సద్దుల బతుకమ్మ రోజు ఇది చాలా ప్రత్యేకం. సజ్జలలాంటి చిరుధాన్యాలతో సద్ద ముద్దలు చేస్తారు అందుకే దీనిని సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు సద్ది(ప్రసాదాలు) ఎక్కుగా తీసుకెళతారు కాబట్టి దీనిని సద్దుల బతుకమ్మ అని కూడా పిలుస్తారు.

● పెరుగన్నం, , చింతపండు పులిహోర, నిమ్మకాయ కొబ్బరి తురుము సద్దులను చేస్తారు. సత్తు పిండి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మలీద ముద్దలు, పులిహోర, కొబ్బరి తురుము, పండ్లు సమర్పిస్తారు. ఇవన్నీ ఆరోగ్యదాయం..

భద్రకాళి.. నమోః నమామి!



రంగంపేట, న్యూస్‌టుడే: వేదవ్యాసుడు రచించిన శ్రీదేవీ భాగవతం ప్రకారం నవరాత్రులు దేవీ ఆరాధనకు ప్రత్యేకమైనవి. విజయదశమి సందర్భంగా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. జగన్మాత నవరాత్రుల్లో తొమ్మిది రూపాలుగా దర్శనమిస్తుంది. అమ్మవారికి ఏరోజు ఏం ప్రసాదం, ఏ చీర సమర్పించాలనేది దేవీ భాగవతంలో పొందుపర్చారు. భద్రకాళి ఆలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అవతారాలు.. అలంకరణ

మొదటిరోజు: బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. ఈ రోజు అమ్మవారికి లేత గులాబి రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. క్షీరాన్నం నైవేద్యం.

2వ: అమ్మవారు వేదమాత శ్రీగాయత్రి దేవిగా దర్శనమిస్తారు. నారింజ రంగు వస్త్రం, కొబ్బరి అన్నం నివేదిస్తారు.

3వ: అమ్మవారు ప్రాణకోటి ఆకలి తీర్చే అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. పసుపురంగు వస్త్రం, అల్లం గారెలు సమర్పిస్తారు.

4వ: శ్రీలలితా మహాత్రిపుర సుందరీదేవిగా దర్శనం. ముదురు బంగారు రంగు వస్త్రం, కదంబం ప్రసాదాన్ని నివేదిస్తారు.

5వ: శ్రీచండీ దేవిగా కొలుస్తారు. భవానిమాతగా దర్శనం, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా చింతపండు పులిహోర, రవ్వకేసరి.

6వ: శ్రీమహాలక్ష్మిగా దర్శనం. ముదురు గులాబి రంగు వస్త్రం, పూర్ణం బూరెలు ప్రసాదం.

7వ: శ్రీసరస్వతి దేవిగా దర్శనం. తెల్లని వస్త్రం, నైవేద్యంగా దద్ధోజనం.

8వ: దుర్గాష్టమి, మహా దుర్గాలంకరణ, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా నిమ్మకాయ పులిహోర.

9వ రోజు: మహానవమి, మహిషాసుర మర్దిని అలంకరణ, ఆకుపచ్చని వస్త్రం, చక్కెర పొంగలి ప్రసాదం.

విజయదశమి: విజయదశమి పర్వదినం రోజు అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, ఎరుపు, ఆకుపచ్చ రంగు వస్త్రాలు సమర్పిస్తారు. లడ్డూలు, పులిహోర, రవ్వకేసరి నైవేద్యం.

అయ్యో పాపం.. ఎంత కష్టం..

● పెళ్లైన ఐదు నెలలకే యువతికి రెండు కిడ్నీల్లో సమస్య

● డయాలసిస్‌తో సాగుతున్న జీవనం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కూతురుకు స్తోమతకు తగినట్లు పెళ్లి జరిపించారు. బాధ్యత తీరిందనుకున్నారు ఆ అమ్మానాన్న.. ఎన్నో ఆశలతో కొత్త కాపురానికి వెళ్లింది.. మెట్టి నింట్లో భర్తతో ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఇంతలోనే పిడుగు లాంటి వార్త.. నవ వధువుకు రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు చెప్పడంతో రెండు కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయాయి. ఆ యువతి జీవన్మరణ పోరాటం చేస్తోంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కోడూరి అనూషకు ఏడాది కిందట బంధువుల అబ్బాయితో వివాహమైంది. ఆయన హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లయిన ఐదు నెలలకు ఓరోజు అనూషకు తీవ్రమైన జ్వరం వచ్చింది. వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పనిచేయడం లేదని నిర్ధారించారు. కొద్దిరోజుల్లోనే మరింత అనారోగ్యానికి గురయ్యింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు విడిచి రోజు డయాలసిస్ చేయిస్తున్నారు. మందులకు, డయాలసిస్‌కు రెండు రోజులకు రూ.5 వేల చొప్పున అవుతున్నాయని, దాదాపు ఇప్పటి వరకు రూ. 11 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. అయినా కిడ్నీ మార్పిడికి, శస్త్ర చికిత్సలకు దాదాపు మరో రూ. 10 లక్షలకు పైగానే ఖర్చవుతాయని తెలిపారు.. రోజూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుని బతికే తమకు అంత ఖర్చు భరించే స్తోమత లేదని, ఇప్పటికే అప్పులు చేసి వైద్యం అందిస్తున్నామని తండ్రి పైడయ్య పేర్కొన్నారు. దాతలు ఆదుకుంటేనే బిడ్డ దక్కుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న అనూష

● దాతలు సహాయం చేయదల్చుకుంటే చరవాణి నంబర్లు 85209 63145, 99129 42026 కి సంప్రదించాలి.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)		
ఫాంరేటు: 110	డ్రెస్డ్: 191	
రిటైల్: 132	స్కిన్‌లెస్: 218	

పేదల బతుకులపై పిడుగు

● ముగ్గురి మృతితో విషాదం

● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

వర్షాకాలం పిడుగుపాటు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్‌లో ముగ్గురు మృత్యువాత పడడం విషాదాన్ని మిగిల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన మహిళ రైతు కె.లక్ష్మి (45) మిరప తోటకు పిండి చల్లుతున్న క్రమంలో పిడుగు పడటంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలు నిర్మల (51), రమ (45) అదే గ్రామానికి చెందిన రైతు పొలంలో పత్తి ఏరి ఇంటికి వచ్చే క్రమంలో పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. కూలీ పనికి వెళ్తే తప్ప పూట గడవని ఆ పేద కుటుంబాలు తీరని దుఃఖంలో మునిగిపోయాయి. పట్టణాలు, పల్లెలు ఎక్కడైనా పిడుగులు పడే అవకాశముంటుందని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

అపార్ట్‌మెంట్లూ అతీతం కాదు

చాలా మంది అపార్ట్‌మెంట్లపై పిడుగు పడదన్న భ్రమలో ఉంటారు. అలాంటిదేమీ లేదని, రానున్న రోజుల్లో పిడుగుల ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ముందస్తు చర్యలతో పిడుగుపాటు ప్రమాదాన్ని నివారించవచ్చని చెబుతున్నారు. వరంగల్ నగరంలో 1000కి పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వాటి సంఖ్య వేగంగా పెరుగుతోంది. పిడుగులు పడకుండా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదు.



● ఆరు నెలల కిందట హనుమకొండ నగరంలోని గాంధీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడటంతో పాక్షికంగా దెబ్బతింది.



గాంధీనగర్‌లోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన లైట్నింగ్ కండక్టర్

నిబంధనలను పాటించాలి

ఎత్తైన భవనాలు, చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. అందువల్ల భవన నిర్మాణ పనులలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రతి ఎత్తైన భవంతిపై తప్పని సరిగా లైట్నింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దానికి ఎర్త్ కనెక్షన్ ఇచ్చుకోవాలి. దీనికి విద్యుత్తును ఆకర్షించే శక్తి ఉంటుంది. ఇది పిడుగు ప్రభావం భవంతిపై పడకుండా అడ్డుకుంటుంది. చూసేందుకు ఇది చిన్న ఏర్పాటే కావొచ్చు. వేల వాల్టుల విద్యుదావేశాన్ని రాగి కడ్డీ ఆకర్షించి ఎర్త్ కనెక్షన్ ద్వారా భూమిలోకి పంపేస్తుంది.

ఇదీ కారణం..

క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడిన సమయంలో తీవ్రమైన గాలులు, ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. పిడుగు పడిన ప్రాంతంలో ఏదైనా బుగ్గి కావాల్సిందే. కొన్ని లక్షల ఓల్టుల విద్యుత్తు తరంగాలు మేఘాల నుంచి భూమిలోకి ప్రవహిస్తాయి. నీటి ఆవిరితో ఉన్న మేఘాలు ఒక్కదానికొకటి తాకడం వల్ల విద్యుత్తు పుడుతుంది. ఈవిద్యుత్తే పిడుగుల రూపంలో భూమిపై పడి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి.

కేయూ ఉప కులపతి ఎవరో?

● రేపు సెర్చ్ కమిటీ సమావేశం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిని నిర్ణయించడం కోసం ఈ నెల 4న సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. 14వ ఉప కులపతిగా బాధ్యతలు నిర్వహించిన సామాజికశాస్త్రం విశ్రాంత ఆచార్యులు తాటికొండ రమేష్ పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగిసింది. ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఇన్‌ఛార్జి ఉప కులపతిగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు ఉప కులపతులు లేకపోవడంతో కొత్తవారిని నియమించడం కోసం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కేయూ వీసీ నియామకం కోసం జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆవుల దామోదర్ (కేయూ నామిని), జమ్మూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని)లతో సెర్చ్ కమిటీని నియమించారు.

158 మంది పోటీ..: విశ్వవిద్యాలయ ఉప కులపతి పదవిని దక్కించుకోవడం కోసం రాష్ట్రంలోని పలు వర్సిటీలు, విద్యా పరిశోధన సంస్థల నుంచి పలువురు పోటీపడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా తీవ్రమైన పోటీ నెలకొంది. 158 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో కేయూ ఆచార్యులు నలుగురు బరిలో ఉన్నారు. ప్రస్తుత రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి (గణిత విభాగం), దూరవిద్య కేంద్రం సంచాలకులు వి.రామచంద్రం (రాజనీతిశాస్త్రం), టి.యాదగిరావు (ప్రభుత్వ పాలనా శాస్త్రం), టి.శ్రీనివాస్ (సామాజికశాస్త్రం)లు పదవిని ఆశిస్తున్నారు.

8 మంది విశ్రాంత ఆచార్యులు..: కేయూలో 30 ఏళ్లపాటు బోధన, పరిశోధన, పరిపాలన సేవలను అందించిన ఆరుగురు విశ్రాంత ఆచార్యులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. వీరిలో జి.దయాకర్, వి.రవీందర్ (రసాయనశాస్త్రం), కె.పురుషోత్తం (ఆంగ్లం), ఎం.అశోక్‌కుమార్, వెంకటనారాయణ (అర్థశాస్త్రం), బి.ఐలయ్య (తెలుగు), టి.శ్రీనివాసరావు (వాణిజ్యశాస్త్రం), సీహెచ్ దినేష్‌కుమార్ (రాజనీతిశాస్త్రం)లు దరఖాస్తు చేసుకొన్నారు.

14న దరఖాస్తుల పరిశీలన..: ఈ నెల 4న రాష్ట్ర సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. దరఖాస్తు చేసుకున్న ఆచార్యుల, విద్యావేత్తల బయోడేటాలను పరిశీలిస్తుంది. బోధన, పరిశోధన, పాలన అనుభవాలను పరిగణలోకి తీసుకుంటుంది. అత్యంత ప్రతిభ కలిగిన ముగ్గురి పేర్లతో జాబితాను గవర్నర్‌కు అందజేస్తారు. వీరి నుంచి ఒకరిని కేయూ ఉప కులపతిగా నియమిస్తారు. ప్రక్రియ సజావుగా సాగితే 15 రోజుల్లో కేయూకు కొత్త వీసీ రానున్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి



కల్యాణి (పాత చిత్రం)

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం దేవేందర్, రమ దంపతుల కుమార్తె కల్యాణి(22) హైదరాబాద్ అమీర్‌పేటలో ఉంటూ ఓ కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటోంది. ఆమెకు కొన్ని రోజుల క్రితం జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చింది. హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా డెంగీ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య


● ఏకలవ్య ఆశ్రమ పాఠశాల భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో రూ.40కోట్లతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల(ఈఎంఆర్ఎస్) నూతన భవనాన్ని బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఝార్ఖండ్‌లోని హజారిబాగ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వెనుకబడిన గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు నెలకొల్పిన వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రారంభ శిలాఫలకాన్ని పీవో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో రూ.40కోట్ల వ్యయంతో ఈ ఆశ్రమ పాఠశాలను నిర్మించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ గురుకులంలో 500 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి అత్యుత్తమైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్మద, ఆర్‌సీవో హరిసింగ్, మండల ప్రత్యేకాధికారి సురేష్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, గురుకుల ప్రిన్సిపల్ అజయ్‌సింగ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీరు రాక.. ఇబ్బందులు తప్పక



పలిమెల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. భగీరథ పైపు లైను ద్వారా వాటర్ ట్యాంకుల నీళ్లు అందడం లేదు. రోజు వచ్చే మూడు బకెట్ల నీరు అవసరాలకు సరిపోవడం లేదని, తాగడానికి నీరు లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కుల వివక్ష అంతమే కేవీపీఎస్ లక్ష్యం



జెండా ఎగురవేస్తున్న గుర్రం దేవేందర్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కుల వివక్షను అంతం చేయడమే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) లక్ష్యమని, ఆ సంఘం జిల్లా కార్యదర్శి గుర్రం దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్‌కాలనీలో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. 26 ఏళ్ల క్రితం కుల నిర్మూలన లక్ష్య సాధనకు కేవీపీఎస్ ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు నిర్వహించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు పోరాటాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, రమేష్, సాంబయ్య, రాజు, మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కుల వివక్ష పోరాట వ్యతిరేక సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మహేందర్ జెండా ఎగురవేసి మాట్లాడారు. దళితులను ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదగనీయ చేయడమే కేవీపీఎస్ ఉద్దేశమని, రాజ్యాంగం తొలగించాలని భాజపా కుట్రను తిప్పికొట్టాలన్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, కుల వివక్షలు పెరిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్వామి, రవి శ్రీను, ఉన్నారు.

పచ్చదనం పెంపొందించాలి



మొక్కకు నీరు పోస్తున్న డీపీవో వసంత

రేగొండ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పచ్చదనం పరిరక్షణను పెంపొందించుకోవాలని భూపాలపల్లి డీపీవో వసంత అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పాండవుల గుట్టలో ఆదివాసీ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడారు. తెలంగాణలోని మొట్టమొదటి హెరిటేజ్ ప్రదేశంగా గుర్తించిన పాండవుల గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేసుకోవడంతో పాటు వారసత్వ సంపదగా సంరక్షించుకోవాలన్నారు. అనంతరం పాండవులగుట్టపై మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీవీఐ డైరెక్టర్ అనిల్‌కుమార్, సచిన్, ఎస్‌ఆర్‌ఓ సౌరభ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మొదటి ర్యాంకు



నాగరాజు

చిట్యాల, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన తిప్పని నాగరాజు ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం విభాగంలో 85.23 మార్కులతో జిల్లా స్థాయి మొదటి ర్యాంకు సాధించారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన నాగరాజు విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో పూర్తి చేశారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రామప్ప కాలనీలో పరిసరాలను శుభ్రం చేస్తున్న సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, అధికారులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్ తెలిపారు. బుధవారం భూపాలపల్లి సింగరేణి డివిజన్ పరిధిలోని కేటీకే 8వ గని సమీపంలోని రామప్ప కాలనీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జీఎం ఉద్యోగులతో కలిసి పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. పట్టణంతో పాటు సింగరేణి కాలనీల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, జ్యోతి, సింగరేణి అధికార ప్రతినిధి కె.మారుతి తదితర అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

జగన్మాతకు హరిద్రాభిషేకం

రంగంపేట, న్యూస్‌టుడే: జగన్మాత శ్రీభద్రకాళి అమ్మవారికి బుధవారం ఉదయం హరిద్రాభిషేకం, పూర్ణాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో 40 కిలోల స్వచ్ఛమైన హరిద్ర చూర్ణం(పసుపు)తో అమ్మవారికి అభిషేకం చేశారు. హరిద్రామయమైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. భద్రకాళీ శరణం మమ అంటూ ప్రణమిల్లారు. రాత్రి 7 గంటలకు శ్రీభద్రకాళీ దేవీ శరన్నవరాత్రుల అంకురార్పణ పూజలు జరిగాయి. గురువారం ఉదయం అమ్మవారికి పూర్ణాభిషేకం, నవరాత్రి కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, ధ్వజ రోహణం కార్యక్రమాలు ఉంటాయని ప్రధానార్చకుడు శేషు తెలిపారు.



తాడిచెర్లలో...



మహాముత్తారం: కొర్లకుంటలో..



కాటారం: గారెపల్లిలో..



చిట్యాలలో బతుకమ్మలతో చిన్నారులు

ఊరూరా బతుకమ్మ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా బుధవారం బతుకమ్మ సంబరాలు మొదటి రోజు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను అలంకరించి ఎంగిలిపూల బతుకమ్మగా అభివర్ణిస్తూ పాటలు పాడారు. చిన్నారులు, ఆడపడుచులు భక్తి శ్రద్ధలతో ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే యంత్రాగం



చిట్యాల: నైన్‌పాకలో..



కొడవటంచలో..



మహదేవపూర్‌లో..

మహాత్ముడి జీవితం ఆదర్శం



మొట్లపల్లిలో..



తాడిచెర్లలో పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్



కాటారంలో..

జిల్లావ్యాప్తంగా పలు కార్యాలయాలు, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీజీ స్వాతంత్ర్యం కోసం చేసిన కృషిని పలువురు నాయకులు కొనియాడారు.

మహదేవపూర్, న్యూస్‌టుడే: సూరారంలో కాంగ్రెస్ శ్రేణులు గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

కాటారం: మండలకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న గాంధీ విగ్రహం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

టేకుమట్ల: స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అనిత, పోలీసుస్టేషన్‌లో ఎస్సై ప్రసాద్, మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్ గౌడ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు.

చిట్యాల: శాంతియుత మార్గంలో భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు గాంధీజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని తహసీల్దార్ నల్లబెల్లి హేమ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, పోలీసుస్టేషన్‌లో ఎస్సై-2 షాఖాన్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి, భాజపా ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ గాంధీ జయంతి నిర్వహించారు.

భూపాలపల్లి: సింగరేణి భారత్ స్కౌట్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుభాష్‌కాలనీలోని కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో సంజీవరావు, స్వామి, రమేష్, రేణుక, సూర్య, రాజమౌళి, లీడర్‌లు, స్కౌట్ గైడ్స్, రోవర్స్ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎస్పీ కిరణ్ ఖరే పూలమాల వేసి నివాళులర్పించారు. ఓఎస్డీ బోనాల కిషన్ పాల్గొన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఛైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, కమిషనర్ రాజేశ్వర్, సుభాష్‌కాలనీలో గాంధీ విగ్రహానికి భాజపా నాయకులు రాజేందర్ పూలమాలవేశారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, రవి, రాంరెడ్డి, సేనాపతి ఉన్నారు.

మొగుళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. మొట్లపల్లిలో వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఆర్ఐ సురేందర్‌రెడ్డి, సంపత్, యాకుబ్, శివ, అంజీ, మధు పాల్గొన్నారు.

గణపురం: గణపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందించారు. కార్యదర్శి విజేందర్, మాజీ సర్పంచి దేవేందర్, రాజేందర్, ఛోటేమియా, నాగేశ్వర్‌రావు, శ్రీదేవి హాజరయ్యారు.

మల్హర్: గాంధీ జయంతి సందర్భంగా పంచాయతీల్లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.



చిట్యాల తహసీల్దార్ కార్యాలయంలో..



సూరారంలో...



గణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో...

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి: పట్టణంలోని గాంధీనగర్ కాలనీ సమీపంలో జంగిడి రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. **- ప్రవీణ్‌కుమార్, గాంధీనగర్**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగిస్తాం. **- నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

● మున్సిపాలిటీ పరిధిలోని ఆకుదారివాడలో వారం రోజులుగా మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్య పరిష్కరించాలి. **- భిక్షపతి, ఆకుదారివాడ**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో కాల్వలు శుభ్రం చేయిస్తాం. **- సెగ్గం వెంకటరాణి, ఛైర్ పర్సన్**

చెత్త తరలింపు

స్పందనకు వందనం

పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో పోచమ్మ ఆలయ ప్రాంతంలో మురుగు కాల్వలు శుభ్రం చేసి, రోడ్డు పక్కనే చెత్త చెదారం పేరుకుపోవడంతో పందుల బెడద సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు కాలనీవాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. విషయాన్ని వార్డు కౌన్సిలర్ రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారాన్ని వాహనంలో డంపింగ్ యార్డుకు తరలించారు.

ముళ్లపొదల తొలగింపు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం దేవస్థానం తూర్పు రాజగోపురం ప్రాంతంలో చెత్తతో పాటు పిచ్చిమొక్కలు పేరుకపోవడంతో భక్తులు సమస్యను మేమున్నాం మీకు తోడుగాకు వివరించారు. దీనిపై స్పందించిన ఆలయ కార్య నిర్వహణాధికారి మారుతి సమస్య పరిష్కరించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ తుషార ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెస్(అండర్-15 విభాగం) పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 మంది బాలబాలికలు హాజరయ్యారని పోటీల నిర్వాహక కార్యదర్శి కన్నా తెలిపారు. ఆర్బిటర్స్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన మల్సాని ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్ రావు, ఎలేటి సదాశివరెడ్డి, మొహన్‌రెడ్డి, కొమురయ్య, నర్సింగరావు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

చిన్నారికి పాము కాటు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరంలో చిన్నారి పాము కాటుకు గురైంది. దేవస్థానం ఎదుట తల్లిదండ్రులు నిర్వహిస్తున్న హోటల్‌లో చిన్నారి జాహ్నవిని నాగుపాము కాలుకు కాటు వేసింది. బాలికను వెంటనే భూపాలపల్లి ఆసుపత్రికి తరలించారు.

పిడుగుపాటుతో ఒకరికి గాయాలు

చిట్యాల, న్యూస్‌టుడే: పిడుగుపాటుతో ఒకరు గాయపడిన సంఘటన మండలం నైన్‌పాకలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెండెల చిరంజీవి కుటుంబంలో ఒకరు మృతి చెందగా బుధవారం మూడు రోజుల కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం భోజనాలు చేసిన అనంతరం ఇంటి వెనకాల చేతులు శుభ్రం చేసుకుంటుండగా ఒక్కసారిగా తాటి చెట్టుపై పిడుగు పడింది. అక్కడే ఉన్న పెండెల సులోచనకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానిక వైద్యుడిని పిలిపించి ఆమెకు చికిత్స అందించారు. ప్రమాదం ఏమి లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆత్మహత్యాయత్నం

గణపురం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం గణపురంలో జరిగింది. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన మోటపోతుల రాజు (35) అప్పులు చేసి తీర్చకపోవడంతో అప్పు ఇచ్చిన వ్యక్తులు రాజు తల్లిదండ్రుల వద్దకు వచ్చి నిలదీశారు. ఈ విషయమై తల్లిదండ్రులు రాజును అడగగా వారిపై దాడి చేయడంతో గణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మనస్తాపం చెందిన రాజు బుధవారం గణపురం పోలీస్ స్టేషన్ సమీపంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

కల్తీ పురుగు మందు.. వాటిల్లిన నష్టం..!

కాటారం, న్యూస్‌టుడే: కాలం చెల్లిన, కల్తీ పురుగు మందులు ఇవ్వడంతో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన రాంచందర్ అనే రైతు బుధవారం ఆరోపించారు. ఈ మేరకు కాటారం ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం.. 15 రోజుల క్రితం కాటారం మండల కేంద్రంలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో పంట ఎదుగుదల కోసం మందులు కొనుగోలు చేసి రెండెకరాల పత్తి చేనుకు పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. పిచికారీ చేసిన పది రోజుల అనంతరం పత్తి చెట్ల ఆకులు మాడిపోయి పూత రాలిపోయి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని, తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

పోలీసుల అదుపులో నిందితులు?

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో జరిగిన యువతిపై సామూహిక అత్యాచారం ఘటనలో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బాధిత యువతి పోలీసులకు తెలిపిన వివరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు పరారీలో ఉన్న మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఘటనపై లాడ్జి నిర్వాహకులను పోలీసులు తీవ్రంగా మందలించారు. పూర్తిస్థాయి వివరాలు తీసుకోకుండా గది ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేల్చారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

మహదేవపూర్, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధి, ప్రభుత్వ పథకాలను తమకు వర్తింపచేయాలని ట్రాన్స్‌జెండర్లు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. మహదేవపూర్‌లో మంత్రి పర్యటన సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన పలువురు ట్రాన్స్‌జెండర్లు మంత్రిని కలిశారు. వారి సమస్యలను విన్నవించారు. తమకు ప్రభుత్వ పరంగా పథకాలు, రాయితీలు, ఉపాధి మార్గాలను అందించాలని వివరించారు. సందర్భంగా మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రృూటి, సంసిత, శాన్విత పాల్గొన్నారు.

4న ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర దేవస్థానం సత్వర అభివృద్ధితో పాటు పర్యాటక ప్రాంత అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 4న జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలో వివిధ శాఖలతో సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 4న వివిధ శాఖల అధికారులతో పాలనాధికారి సమావేశం కానున్నారు.

ఏటీఎం చోరీ కేసు ఛేదన



పోలీసులు అదుపులో నిందితుడు అబ్దుల్ గని

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును బయ్యారం పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. చోరీకి పాల్పడిన దుండగుల్లో ఒకరిని పట్టుకొని విచారణ కొనసాగిస్తున్నారు. డీఎస్పీ తిరుపతిరావు కథనం ప్రకారం.. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను ఫిబ్రవరి 18న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ధ్వంసం చేసి సుమారు రూ.28 లక్షల నగదు చోరీ చేసి పరారయ్యారు. జిల్లా ఎస్పీ రాంనాథ్‌కేకన్ ఆదేశాల మేరకు గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ఈ సంఘటనపై సుమారు 8 నెలలపాటు దర్యాప్తు కొనసాగించి దుండగుల్లో ఒకరిని పట్టుకొని బుధవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లా పలోడి ప్రాంతానికి చెందిన అబ్దుల్ గని మరికొంత మందితో కలిసి ఫిబ్రవరి 18న అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో కారులో వచ్చి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసులో గనిని ఏ1 నిందితుడిగా కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు

సకాలంలో స్పందించి.. ప్రాణాలు కాపాడి

మట్టెవాడ, న్యూస్‌టుడే: డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు బుధవారం ఓ వ్యక్తిని కాపాడారు. సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. కేరళ రాష్ట్రానికి చెందిన మను, సౌమ్య దంపతులు తమ కుమార్తెతో కలిసి పదేళ్లుగా కురవి మండల కేంద్రంలో సిద్ధార్థ పాఠశాలలో పనిచేస్తున్నారు. అక్కడ జీతం చాలకపోవడంతో ఇటీవల వరంగల్ నగరానికి వచ్చారు. ఓ లాడ్జిలో ఉంటూ నాలుగురోజులుగా మను ఉద్యోగం కోసం అన్వేషించాడు. కానీ ఎలాంటి పని దొరకలేదు. దీంతో మనస్తాపానికి గురైన మను కేరళలోని తన స్నేహితుడికి ఆత్మహత్య చేసుకుంటానని సమాచారం ఇచ్చారు. అతను వెంటనే డయల్ 100కు ఫోన్ చేశాడు. ఆ సమాచారంతో దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఉన్న మనును పోలీసులు గుర్తించి ఠాణాకు తీసుకొచ్చి.. కౌన్సెలింగ్ ఇచ్చారు. దంపతులు కేరళ వెళ్లడానికి ఆర్థికసాయం చేశారు.

ట్రోలింగ్‌పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

మట్టెవాడ, న్యూస్‌టుడే: మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, సంబంధంలేని విషయాలపై ట్రోలింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర మైనార్టీ నాయకులు మహ్మద్ అయూబ్ కోరారు. బుధవారం ఇంతేజార్‌గంజ్ ఠాణాలో సీఐ మచ్చ శివకుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. కార్పొరేటర్లు అనిల్, పుర్ఖాన్, సురేష్, నాయకులు వసీం, గిన్నారం రాజు, ప్రసాద్, రవీందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

సింగరేణికి కష్టకాలం.. చేరని లక్ష్యం

గోదావరిఖని, న్యూస్‌టుడే

బొగ్గుబాయి ముచ్చట్లు

ఈ ఏడాది సాధించాల్సిన లక్ష్యాన్ని సింగరేణి చేరుకోలేకపోయింది. అర్ధ సంవత్సరంలో 28.44 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. రానున్న ఆరు నెలల్లో ఇంకా 43.56 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్ధేశించుకుంది. సింగరేణి వ్యాప్తంగా కేవలం రెండు డివిజన్‌లు మాత్రమే వంద శాతానికి మించి బొగ్గు ఉత్పత్తి చేశాయి. సెప్టెంబరులో వర్షాలు ఎక్కువగా కురియడంతో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.

పనుల నిలిపివేత..

కొన్ని గనుల్లో ప్రైవేటు కాంట్రాక్టు కంపెనీలు పనులు నిలిపివేయడంతో ఉత్పత్తిపై ప్రభావం పడింది. గతనెలలో 31.58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ధేశించుకున్నప్పటికీ.. కేవలం 28.44 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే చేపట్టింది. బొగ్గు డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ.. ప్రకృతితోపాటు సంస్థాగతంగా ఎదురవుతున్న ఇబ్బందులతో నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.

కొండంత భారం..

రానున్న ఆరు నెలల్లో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం రోజుకు 1.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి.. రానున్న కాలంలో దానికి రెట్టింపు ఉత్పత్తి చేస్తేనే నిర్ధేశించిన వార్షిక లక్ష్యాన్ని చేరుకునే అవకాశముంది. అంటే నెలకు 7 మిలియన్ టన్నుల కంటే అధికంగా ఉత్పత్తి చేయాల్సి ఉంది.

కొత్త గనులు అందుబాటులోకి వస్తేనే..

ఈ ఏడాదిలో కొత్తగా ప్రారంభించనున్న గనులు అందుబాటులోకి వస్తేనే వార్షిక లక్ష్యాన్ని అధిగమించేందుకు అవకాశముంది. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకుతో పాటు కొత్తగూడెంలోని వీకే ఓసీపీ, ఇల్లెందులోని రొంపేడు ఓసీపీ, బెల్లంపల్లి ప్రాంతంలోని గోలేటి ఓసీపీల్లో పనులు ప్రారంభిస్తే ఉత్పత్తి పెరగనుంది. ప్రస్తుతం కొన్ని గనులకు ప్రభుత్వ పరంగా క్లియరెన్సులు, అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. రామగుండంలోనూ కొత్తగా మెగా ఓసీపీ ప్రారంభించేందుకు యాజమాన్యం ప్రణాళికలు చేసుకుంది. ఒడిశాలోని నైనీ బొగ్గుబ్లాకులో ఉత్పత్తి ప్రారంభించేందుకు సిద్ధమైంది.

గని కార్మికుల క్రికెట్ పోటీలు

గోదావరిఖని: సింగరేణి జీడీకే-1 గని కార్మికుల క్రికెట్ పోటీలు బుధవారం ఆసక్తిగా సాగాయి. స్థానిక పీజీ కళాశాల క్రీడా మైదానంలో 8 జట్లుగా ఏర్పడి పోటీ పడ్డారు. వీటిని ఏఐటీయూసీ నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్‌లు ప్రారంభించారు.